అన్నదాతల్లో తుఫాన్ గుబులు

పంట చేతికొచ్చే సమయంలో ఇదేం విపత్తని ఆందోళన

కాళ్ల: ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట చేతికందే సమయంలో తుఫాన్ హెచ్చరికలతో రైతుల్లో గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మండలంలో వరి పంట కొన్ని గ్రామాల్లో ఇనిక దశలోనూ, కొన్ని గ్రామాల్లో పంట పండి కోతలకు కోసేందుకు అనువుగా ఉన్నాయి. దీంతో మరికొంతమంది వరి కోతలకు సన్నద్ధమవుతున్నారు. వరి నాట్లు వేసిన నాటి నుంచి తుఫాన్‌లతో ఇబ్బందులు పడుతూనే మళ్లీ పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ హెచ్చరికలు అన్నదాతల గుండెల్లో గుబులు పుట్టిస్తు న్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో రెండు రోజుల నుంచి ఆకాశం మబ్బులు పట్టి వాతావరణం చల్లబడింది. నిత్యం ఆకాశం మేఘావృతమై కనిపించడంతో అన్నదాలు ఆందోళన చెందుతున్నారు.

వరికోతలపై సందిగ్ధత

ప్రస్తుతం ఆకాశం నిత్యం మేఘావృతమై ఏ సమయంలోనైనా వర్షం కురవచ్చు అనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఉండి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ముందుగా నాట్లు వేసిన చోట ఇప్పటికే వరికోతలు ప్రారంభమయ్యాయి. ఇలాంటి సమయంలో తుఫాన్ హెచ్చరికలు రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. నాలుగు రోజుల తర్వాత కోతలు కోసినా వర్షం కురిసిన ఈదురు గాలులు వేసిన పంట మీద ఉన్న చేను నేలకొరిగే ప్రమాదం ఉందని తద్వారా ధాన్యం రంగు మారిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు వాతావరణం మార్పులతో ఇబ్బందిగా ఉన్నప్పటికి వర్షం పడకపోవడం రైతులు ఊపిరిపీల్చుకుంటున్నారు. అయితే పెద్ద వర్షం పడినా, ఈదురు గాలులు వీచినా పంట నష్టపోయే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రైతులు ఎకరానికి 20 వేల దాకా పెట్టుబడులు పెట్టామని, ఈ సమయంలో వర్షాలు పడితే తీవ్ర నష్టపోతామని వాపోతున్నారు.


కాళ్లలో ఈనిక పూర్తయి కోతకు సిద్ధంగా ఉన్న చేను

సాగు విస్తీర్ణం ఇలా

మండలం	ఎకరాలు
కాళ్ల	3800
ఆకివీడు	3400
పాలకోడేరు	10500
ఉండి	10749
మొత్తం	28,449

ఆందోళన వద్దు

తుఫాన్ హెచ్చరికలతో వాతావరణం ఇబ్బందికరంగా ఉంది. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. కొద్దిపాటి వర్షానికి రైతులు అధైర్యపడవద్దు. ఒకవేళ భారీ వర్షం వస్తే నీటిని బయటికి తోడుకుని ధాన్యం మొలకెత్తకుండా ఐదు పర్సెంట్ ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

– జయ వాసుకి, ఏఓ, కాళ్ల

నష్టం వస్తుందని భయమేస్తోంది

తుఫాన్ హెచ్చరికలతో ఆరుగాలం పండించిన పంట నష్టపోతామేమోనని భయమేస్తుంది. నాలుగు ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. ఇప్పటికే ఎకరానికి 20 వేల రూపాయాల వరకు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం వర్షాలు పడకపోయినా వాతావరణంలో వస్తున్న మార్పులతో ఆందోళన చెందాల్సి వస్తుంది.

– వర్రె వెంకటరత్నం, కాళ్ల, కౌలు రైతు

క్లుప్తంగా

దేశ ప్రగతికి గ్రామాలే కీలకం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వై.దోసిరెడ్డి

ఆకివీడు: దేశ ప్రగతికి గ్రామాలే కీలకమని జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇన్‌చార్జి అధికారి, డీఎల్‌డీఓ వై.దోసిరెడ్డి చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో సచివాలయ సిబ్బందికి, కార్యదర్శులు, డ్వాక్రా వీఏఓలు, మండల స్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలమేరకు నిధుల లభ్యత, ప్రణాళిక తయారీ యాప్‌ల వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుహాసిని, తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఎంఈఓ ఎ.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఉండి: వాతావరణ పరిస్థితులరీత్యా రైతులంతా ధాన్యాన్ని త్వరగా అమ్ముకునేందుకుగానూ ఉండి మండలం చిలుకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తహసీల్దార్ కె.నాగార్జున తెలిపారు. మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాగార్జున మాట్లాడుతూ ధాన్యానికి ప్రభుత్వం కామన్ రకం క్వింటా రూ.2300, ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2320 మద్దతు ధరను ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో సీఎస్ డీటీ ఎం.మహేష్, కార్యదర్శి రవి, వీఆర్వో విజయలక్ష్మీ పాల్గొన్నారు.

విద్యుత్ భారాన్ని తగ్గించాలని వినతి

ఆకివీడు: రైతులు, ప్రజలకు విద్యుత్ వినియోగం షాక్‌కు గురిచేస్తుందని సీపీఎం నాయకులు పెంకి అప్పారావు ఆందోళన వ్యక్తంచేశారు. విద్యుత్ స్మార్టు మీటర్లు రైతులకు, వినియోగదారులపై పెనుభారం మోయను న్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మీటర్ల మారిడిపై రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బి.రాంబాబు, సందక సూరిబాబు, గేదల ధనుష్, తులసి, భవానీ, మిద్దే వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

వైభవంగా ప్రత్యేక హోమాలు

కాళ్ల: కార్తీకమాసం చతుర్దశిని పురస్కరించుకొని బొండాడ గ్రామంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత భోగేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి ఆలయాల ప్రాంగణంలో గురువారం సుబ్రహ్మణ్య సహిత శ్రీ పంచాయతన దేవతార్చన, శివ విష్ణు,గణపతి, సూర్య, దుర్గ హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఈ హోమాలు మందపాటి విశ్వేశ్వరరావు–విజయలక్ష్మి దంపతులు, కోటేశ్వరరావు–వరలక్ష్మి దంపతులు, వెంకన్న–వరలక్ష్మి దంపతులు కుటుంబ సమేతంగా నిర్వహించారు. ప్రత్యేక హోమాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో 3000 మందికి అన్న సమారాధన నిర్వహించారు.

రైతుసేవలో సహకార పరపతి సంఘాలు

భీమవరం అర్బన్: రైతులు ఆర్థికంగా ఎదిగేందుకే లక్ష్యంగా సహకార సంఘాలు దోహద పడతాయని మండల సహకార సంఘాల అధికారిని పిల్ల గంగా రత్నం అన్నారు. భీమవరం మండలంలోని తాడేపల్లి గ్రామంలో సహకార పరపతి సంఘంలో గురువారం వారం రోజులు పాటు జరిగే 71వ అఖిలభారత సహకార సంఘాల వారోత్సవాలను జెండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగారత్నం మాట్లాడుతూ భారతదేశాన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో సహకార సంఘాల పాత్ర చాలా కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సీఈవో నందమూరి సుబ్బారావు, సంఘం పరిధిలోని గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు

అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారంటూ ఫిర్యాదు

భీమవరం: భీమవరం మునిసిపాల్టీ మెప్మా విభాగంలో పనిచేస్తున్న తనను సిహెచ్ నాని బాబు మరోనలుగురు మానసికంగా వేధిస్తున్నారని భీమవరం పట్టణం గుల్లంకివారి వీధికి చెందిన మహిళ గురువారం ఫిర్యాదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు గంటలకు భీమవరం కలెక్టర్ కార్యాలయం మీకోసం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జిల్లా జల వనరులశాఖ అధికారి పి.నాగార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. నీటి పారుదల సలహా మండలి సభ్యులు అందరూ సమావేశానికి హాజరు కావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరవాసరం: మండలంలో 33/11 కేవీ కొణితివాడ సబ్‌స్టేషన్ నందు లైన్ల మరమ్మతులు, చెట్లు కొమ్మలు తొలగించడానికి శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ మధు కుమార్ తెలిపారు. కొణితివాడ సబ్ స్టేషన్ పరిధిలోని కొణితివాడ, నేలపోగుల, మడుగు పోలవరం, మడుగు పోలవరం లంక, మత్స్యపురి, బొబ్బనపల్లి మెంటేపూడి గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భీమవరంలో..

భీమవరం: భీమవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కె వి మసీదు ఫీడర్‌పై చెట్లు, కొమ్మలు తొలగిండగానికి శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పెద్ద మసీదు, వీరమ్మ పార్క్, రాయప్రోలు వారి వీధి, భీమనాథంవారి వీధి, చినపేట, రామాయణపు వారి తోట, మినీ షిర్డీ, ముత్యం వారి తోట, వానపల్లి వారి వీధికి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

నేడు మండలస్థాయి అధికారులకు శిక్షణ

ఉండి: మండలస్థాయి అధికారులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.రవీంద్ర తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకట విడుదల చేశారు. మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక, మండల పరిషత్ 2025–26నకు మెరుగైన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పురోగతి,ప్రణాళికలను సాధించుట కోసం సామర్థ్యాల పెంపుదలపై శిక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మండలపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శిక్షణకు హాజరయ్యే అధికారులంతా ఆధార్ కార్డు,ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నంబర్‌తో హాజరుకావాలని సూచించారు.

కార్తీక దీపోత్సవం

భీమవరం అర్బన్: మండలంలోని కొత్త పూసలమర్రు గ్రామంలో కోదండ రామాలయం వద్ద కార్తీక మాసం సందర్భంగా గురువారం కార్తీకదీపోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు భక్తి గీతాలను ఆలపించారు.

విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

భీమవరం: చదువుకునే వయస్సులో విద్యార్థులు చదువుపై మాత్రమే దృష్టి పెట్టాలని సెల్‌ఫోన్స్, ఇంటర్నెట్‌కు దూరంగా ఉండాలని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్ అన్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా ఉండి రోడ్డులోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు స్కూల్ స్థాయి నుంచే లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. పి.అంబేడ్కర్, డి రవికిరణ్, వి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం


భీమవరంలో రోటరీక్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం దృశ్యం

భీమవరం: సమాజ సేవకు రోటరీ క్లబ్ మంచి వేదికని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ అన్నారు. గురువారం భీమవరం రోటరీక్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారానికి ఇన్స్టాలేషన్ అధికారిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ రోటరీక్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. భీమవరం రోటరీ క్లబ్ ద్వారా ఎడ్వర్డ్ ట్యాంక్, జూపూడి సూర్య కృష్ణ మున్సిపల్ పార్క్‌ను రూ.55 లక్షల వ్యయంతో అభివృద్ధి చేశామన్నారు. అనంతరం రోటరీ క్లబ్ అధ్యక్షునిగా గుండు కిషోర్, ఉపాధ్యక్షుడిగా నడిపల్లి నర్సింహారావు, సెక్రటరీగా ఎంఎస్ విజయభాస్కర్, ట్రెజరర్‌గా బొండా వెంకట సుబ్బారావు, జాయింట్ సెక్రటరీగా వివిఎస్ ప్రసాద్, డైరెక్టర్స్‌గా వబిలిశెట్టి పట్టాభిరామయ్య, షేక్ బాబాజీ సాహెబ్, ఎస్‌వీఆర్‌సి జయవర్మ, గంధం శ్రీదేవి, పోలియో చైర్మన్‌గా ఎ సురేష్, ఫౌండేషన్ చైర్మన్‌గా ఎ మంగేష్, ఇంటర్నేషనల్ సర్వీసెస్ ఐఎస్ వెంకటేష్, క్లబ్ సర్వీస్ ఓలేటి శ్రీనివాస్, పబ్లిక్ ఇమేజ్ పి నాగేశ్వరరావు, కమ్యూనిటీ సర్వీస్‌గా ఎం శేఖర్, మడిపల్లి శేఖర్, యూత్ సర్వీస్‌గా కార్మూరి కిరణ్, ఒకేషనల్ సర్వీస్‌గా కనగల కిషోర్, మెంబర్షిప్ డెవలప్మెంట్‌గా గుండు గిరిలో శ్రీనివాస్‌లతో ప్రమాణ స్వీకరం చేయించారు.

బాలలు విద్యతో ఉన్నత స్థానాలను అధిరోహించాలి

కలెక్టర్ నాగరాణి

భీమవరం: బాలలు విద్యతో లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఏఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భవిష్యత్తులో సమాజాన్ని నడిపించే దార్శనికులు నేటి బాలలేనని పిల్లలు అనవసర విషయాలపై దృష్టి పెట్టకుండా ఉన్నత లక్ష్యంతో జీవితంలో మంచి స్థానానికి ఎదగాలన్నారు. సెల్‌ఫోన్స్, సినిమాలు, సోషల్ మీడియా, మత్తు పదార్థాలవంటి దురలవాట్లకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని కలెక్టర్ నాగరాణి ఉద్బోధించారు. బాలలకు కొన్ని ప్రత్యేక హక్కులు రాజ్యాంగం కల్పించిందని వాటిపై అవగాహన కలిగి సమాజంలో ముందుకు సాగాలన్నారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్ కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. బాలల హక్కులపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారిణి బి సుజాత రాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్ రాజేష్, మండల విద్యాశాఖాధికారి ఎస్ శ్రీనివాస రావు, ప్రధానోపాధ్యాయుడు ఎవి సత్యనారాయణ, పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ డి రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: మండలంలోని పాందువ్వ ఎంపీపీ స్కూల్‌లో దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం డి.గోపాలం మాట్లాడుతూ నెహ్రూ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి, ఆర్ఎంపీ సోడదాసి రాంబాబు, అంగన్‌వాడీ వర్కర్స్ సత్యవేణి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.


భీమవరం: బాలల హక్కుల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి


కాళ్ల: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కాళ్లలో..

కాళ్ల: బాలల దినోత్సవాన్ని గురవారం ఆయా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటలు పోటీలతో పాటు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కోపల్లె మెయిన్ స్కూల్లో వివిధ ఆట పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను సర్పంచ్ బుడి నాగమణి, ఉపసర్పంచ్ బూడి వెంకటపరాలు అందించారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

ఆకివీడు: విద్యార్థులు సృజనాత్మక శక్తిని వినియోగించి విద్యలో రాణించాలని హెచ్‌ఎం తోట పోతరాజు పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ స్కూల్‌లో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశలలో 1981–82లో పదవ తరగతి చదివిన పూర్వవిద్యార్థుల సహకారంతో విజేతలకు రూ. 16 వేల విలువైన బహుమతులు అందజేశారు. పాఠశాలలో క్రీడలను ప్రోత్సహించేందుకు రూ. 17,300లతో టెన్నిస్ కాయిట్ రింగ్స్, స్కిప్పింగ్ రోప్స్, క్యారం బోర్డులు, చెస్ బోర్డులు, యోగా మ్యాట్స్, వాలీబాల్స్ అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె.సత్యనారాయణ, గోపాలకృష్ణ, నారాయణ, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆకివీడు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పాలకోడేరు: గొరగనమూడి స్వామి జ్ఞానానంద హైస్కూల్ విద్యార్థులు 68వ రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల్లో అండర్ 14 బాలికలు, అండర్ 17 బాలురు పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి ద్వితీయ స్థానం సాధించారని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వై. హేమలత తెలిపారు. ఈ నెల 8 నుంచి 10 వరకు విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 14 నెట్ బాల్ బాల బాలికల పోటీల్లో బాలికల విభాగంలో డి.జోత్స్న నాగసాయి, పి.వసుంధర, టి.మహాలక్ష్మి, డి.గీతిక, జి.అనుస్య, ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. అలాగే నెల్లూరు జిల్లాలో ఈ నెల 10 నుంచి 12 వరకు జరిగిన అండర్ 17 బాలుర నెట్ బాల్ పోటీల్లో ఎస్.విలియం, కె.హర్షవర్ధన్, బి.రాజేష్, ఎ.నిఖిల్ వినయ్, కె.లోకేష్, ఎస్.మహేష్ బాబు ద్వితీయ స్థానం సాధించారని ఆమె తెలిపారు. అండర్ 14 విభాగంలో డి.జోత్స్నా నాగ సాయి, జి.సురేష్ బాబు, అండర్ 17 విభాగంలో ఎస్ నిఖిల్ వినయ్, స్టాండ్ బై కె.హర్షవర్ధన్ లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లుగా పీడీ ఎస్.విజయలక్ష్మి తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అతిథులుగా విచ్చేసిన గొరగనముడి సర్పంచ్ గొట్టుముక్కల శివాజీ రాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పొన్నమండ బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు కృష్ణకుమారి, సినీ నటుడు శ్రీరామ్ జగన్ తదితరులు విద్యార్థులను అభినందించారు.


ద్వితీయ స్థానం సాధించిన అండర్ 17 బాలుర నెట్ బాల్ క్రీడాకారులు

ఇంజనీరింగ్ విద్యార్థులకు దాతల ప్రోత్సాహం అభినందనీయం

భీమవరం: ఉన్నత చదువులకు సైతం ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థులు వెనుకడుగు వేయకుండా దాతలు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని భీమవరం డీఎన్నార్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) అన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇంజనీరింగ్ చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులు ఫీజు చెల్లించడానికి పట్టణానికి చెందిన కొత్త శ్రీనివాస్ ముందుకు వచ్చి స్కాలర్‌షిప్‌లు అందజేశారు. తమ కళాశాలలో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు గత 50 ఏళ్లుగా ఆర్థిక ప్రోత్సాహం అందజేస్తున్నట్లు తెలిపారు. కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో చేరిన ప్రతిభ వంతులైన విద్యార్థులకు గత ఐదేళ్లుగా రూ. 2 లక్షలు ఆర్థిక చేయూత నిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్థిక ప్రోత్సాహం అందుకున్న విద్యార్థులు

రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

భీమవరం అర్బన్: రోడ్డుపై గుంతల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ రాహుల్ కుమార్‌రెడ్డి ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. భీమవరం మండలంలోని చిన్న అమిరం గ్రామంలో గురువారం రోడ్డు పై గుంతల పూడ్చివేత పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులలో ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పూర్తి నాణ్యత ప్రమాణాలతో ఉండాలని అధికారులను ఆదేశించారు. వాహనదారులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ బోర్డులను ఉపయోగించి రోడ్డు నిర్మాణ పనులలో జాప్యం జరగకుండా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్ రెడ్డి

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం: గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ మహేశ్వరరావు అన్నారు. భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువరుల సంఘం, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాలు బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తాయని, విజ్ఞాన సముపార్జనకు దోహదపడుతాయన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ బీవీఎస్ వర్మ, లైబ్రేరియన్ కె శిరీష, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంచుతాయని, తద్వారా పిల్లలు ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జాతీయస్థాయి, యూనివర్శిటీ స్థాయిలో కరాటే, రైఫిల్ షూటింగ్‌ల్లో ప్రతిభ కనబర్చిన 22 మంది క్రీడాకారులకు జవహర్ లాల్‌నెహ్రూ పేరిట మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, కరాటే కోచ్ షేక్ సుబాని, పిఈటి నర్సింహరాజు, రామభద్రిరాజు, దాయన చంద్రాజీ, పరిమి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


భీమవరం డీఎన్నార్ కళాశాలలో క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పట్టుదలతో చదవాలి

ఉండి: పట్టుదలతో చదివి అనుకున్నది సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని యండగండి కోఆపరేటివ్ రూరల్‌బ్యాంక్ కార్యదర్శి,గ్రంథాలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రవికుమార్ అన్నారు. గురువారం 57వ గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా స్థానికంగా ఉండే వివిధ పాఠశాలల విద్యార్థులు గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రవికుమార్ గ్రంథాలయ విశిష్టతను వివరించారు. గ్రంథాలయ అధికారి సీహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ 15వ తేదీ నుంచి విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ఉండిలో గ్రంథాలయ వారోత్సవాలను ఉపాధ్యాయుడు ఈ సుదర్శన్ ప్రారంభించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎస్‌పీ శ్యామలరావు,రిటైర్డ్ లైబ్రేరియన్ మహంకాళి, గ్రంథాలయ అధికారి జేవీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


ఉండి: యండగండిలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్లలో..


కాళ్ల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ప్రారంభించారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులకు అభినందనలు

భీమవరం: నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈనెల 10 తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ నెట్ బాల్ అండర్–19 బాల,బాలికల పోటీల్లో భీమవరం బ్రౌనింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చడం అభినందనీయమని బ్రౌనింగ్ విద్యాసంస్థల చైర్మన్ మేడిది జాన్సన్ అన్నారు. గురువారం కళాశాలలో పతకాలు సాధించిన బాలికల విభాగంలో విజయం సాధించిన ఎస్ ప్రవీణ, జి లిఖిత, కె బాలజ్యోతి, ఎస్ వర్షిత లక్ష్మి భద్ర, బాలురు విభాగంలో ఎస్ మణికంఠ, పి దుర్గా గణేష్, ఎస్ సుందర్ సింగ్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రంపా ఎలిషా, విద్యాసంస్థల సెక్రటరీ మేడిది ఎస్తేర్ ప్రియాంక, వైస్ ప్రెసిడెంట్ అబ్రహం, పిడి దావుద్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల పాత్ర కీలకం

పాలకోడేరు: 100 సంవత్సరాల భారతదేశం 2047 సంవత్సరాలు నిర్దేశిత లక్ష్యంగా వికసిత్ భారత్ ప్రణాళికలో సహకార సంఘాల తోడ్పాటు చాలా అవసరమని భీమవరం విభాగ సహకార అధికారి కె .వెంకటేశ్వరరావు అన్నారు 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా ఎల్‌ఎస్‌సీఎస్ వద్ద సహకార పథకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ వారోత్సవ ప్రధానమైన వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర గురించి, సహకార మంత్రిత్వ శాఖకు సంబంధించిన కొత్త కార్యక్రమాల ద్వారా సహకార ఉద్యమం బలోపేతం చేయడం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ విజయవాడ జోనల్ విద్యాధికారి కె.భోజ రంగరాజు, పాలకోడేరు సహకార జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వేటుకూరి పద్మావతి, పాలకోడేరు ఎల్‌ఎస్‌సీఎస్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి వీవీఎల్ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కె.వెంకటేశ్వరరావు